క్లుప్తంగా

ప్రతిభకు పట్టం



గుడ్లవల్లేరు: శేషాద్రిరావు గుడ్లవల్లేరు ఇంజినీరింగ్ కాలేజీలో కామ్ వాల్ట్ సిస్టమ్ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్ వారు నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ ఆఖరి సంవత్సరం విద్యార్థి ఎస్.బసవేశ్వర ముఖేష్ తన ప్రతిభను చాటాడు. రూ.31.7లక్షల ప్యాకేజీతో ముఖేష్ ఉద్యోగం పొందినట్లు ఆ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.ప్రసాద్ శుక్రవారం తెలిపారు. అంతేగాక కరోనా క్లిష్ట పరిస్థితుల్లో సైతం ఇప్పటివరకు వివిధ బహుళ జాతి కంపెనీల్లో 705 ఆఫర్లు ముఖేష్ సాధించినట్లు పేర్కొన్నారు. ఆ విద్యార్థిని కాలేజీ చైర్మన్ డాక్టర్ వల్లూరుపల్లి నాగేశ్వరరావు, కార్యదర్శి సత్యనారాయణరావు, సహ కార్యదర్శి రామకృష్ణ, సలహాదారు డాక్టర్ పి.రవీంద్రబాబు, డైరెక్టర్ డాక్టర్ బి.కరుణకుమార్, వైస్ ప్రిన్సిపాల్ కోదండ రామారావు, అధ్యాపకులు అభినందించారు.

భైరవపట్నంలో రాజ్యాంగ ప్రతుల అందజేత



మండవల్లి: మండలంలోని భైరవపట్నంలోని ఓ వివాహ వేడుకల్లో ఐక్య వేదిక నాయకులు భారత రాజ్యాంగ ప్రతులను గురువారం రాత్రి అందజేశారు. ఈ సందర్భంగా నూతన వధూవరులతో పాటు ప్రతిఒక్కరికీ అందజేసి ఆసక్తి కలిగించారు. ఐక్య వేదిక జిల్లా కన్వీనర్ ఎల్ఎస్ భాస్కరరావు, మండల అధ్యక్షుడు టి.అప్పారావు, సుధామ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, ప్రొఫెసర్ ఎస్.విజయ్‌కుమార్, ఐక్య వేదిక సభ్యులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులు సద్వినియోగం చేసుకోవాలి



మండవల్లి: మండలంలోని చింతపాడులో పంట కాలువ తవ్వకం పనులను శుక్రవారం ఉపాధి హామీ పథకం ద్వారా కూలీలు నిర్వహించారు. ఎంటీఏ నవీన్ మాట్లాడుతూ రూ.1లక్షా 20 వేల నిధులతో పంట కాలువ తవ్వకం పనులు జరుగుతున్నట్లు పేర్కొన్నారు. 46 మంది కూలీలు పనులు చేసినట్లు తెలిపారు. ఎంటీఏ మాట్లాడుతూ ఉపాధి పనుల ద్వారా రైతుల పంట కాలువల అభివృద్ధి చెంది సాగునీటి సమస్యలు పరిష్కారమవుతున్నాయన్నారు.

వ్యాసరచనలో గుడ్లవల్లేరు విద్యార్థికి స్టేట్ సెకండ్ ర్యాంక్



గుడ్లవల్లేరు: తపాలా శాఖ వారు '2047లో నా భారతదేశం' అనే అంశంపై నిర్వహించిన ఇంగ్లిషు వ్యాసరచన పోటీల్లో గుడ్లవల్లేరు ఏఏఎన్ఎం అండ్ వీవీఆర్ఎస్ఆర్ హైస్కూల్ పదో తరగతి విద్యార్థిని యు.ఉషాప్రియ స్టేట్ సెకండ్ ర్యాంక్‌ను సాధించింది. ఉషాప్రియకు శుక్రవారం రూ.10వేల బహుమతిని అందించినట్లు హైస్కూల్ హెచ్ఎం జి.మురళీకృష్ణ తెలిపారు. విజేతతో పాటు శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయులు వజ్రధరరావు, అజంతుల్లాను హైస్కూల్ డైరెక్టర్ నారాయణం శ్రీనివాసమూర్తి అభినందించారు.

బహిరంగ విసర్జనను నివారించాలి

గుడ్లవల్లేరు: బహిరంగ మల విసర్జనను నివారించాలని జిల్లా కో–ఆర్డినేటర్ రాము అన్నారు. పోలిమెట్ల, చిత్రంలో శుక్రవారం ఆయన పర్యటించి స్థానిక అంగన్‌వాడీలు, సచివాలయాలను పరిశీలించి పనితీరును అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట సర్పంచులు అడుసుమిల్లి సత్యనారాయణ, గళ్లా అక్కయ్య నాయుడు, గ్రామ కార్యదర్శి ఎం.సత్యనారాయణ ఉన్నారు.

తెల్లమందారం మొక్కకు గులాబీ మందారం



కంకిపాడు: తెల్లమందారం మొక్కకు గులాబీ మందారం పూసింది. ఈడుపుగల్లు గ్రామంలోని సాయిశ్రీ నివాసంలో పెంచిన తెల్ల మందారం మొక్కకు పాల గులాబీ వర్ణంలో మందారం వికసించి అబ్బురపరుస్తుంది. జన్యుపరమైన మార్పులు, జన్యువు ఆధిక్యం కనబర్చినపుడు జరిగే మార్పుతో రంగు మార్పు వచ్చి ఉంటుందని ఏలూరు జిల్లా ఉద్యాన నిపుణులు జి.లక్ష్మపతి 'సాక్షి'కి తెలిపారు.

పచ్చి రొట్టసాగుకు ఇదే అదును

పామర్రు: రబీ సాగు పూర్తి అయిన తర్వాత పచ్చిరొట్ట పైరులను పెంచేందుకు ఇదే అదును. రబీ అనంతరం పొలాల్లో పచ్చి రొట్ట సాగుతో భూసారాన్ని పెంచుకుని తద్వారా రసాయన ఎరువులను తగ్గించుకోవచ్చని వ్యవసాయ అధికులు చెబుతున్నారు. ఈ సాగుకు సంబంధించిన విషయాలను అధికారులు వెల్లడించారు. పచ్చిరొట్ట పైరు సాగుతో ఆరోగ్యకరమైన పంట ఉత్పత్తి కావడంతో పాటు రసాయన ఎరువుల వాడకాన్ని కూడా తగ్గించవచ్చు.

పచ్చిరొట్ట పంటల రకాలు

జనుము, జీలుగ, పిల్లిపెసర, ఉలవ, నీలి, ఆడవినీలిని పచ్చిరొట్ట పైర్లు అంటారు. పూత దశ వరకూ పెంచి తర్వాత భూమిలో కలియదున్నాలి. పచ్చిరొట్ట పైర్లలో స్థూల పోషకాలైన నత్రజని 1.8 శాతం నుంచి 3.5 శాతం వరకూ ఉంటుంది. అదేవిధంగా భాస్వరం 0.1శాతం నుండి 3.5 శాతం వరకు ఉంటుంది. అదేవిధంగా భాస్వరం 0.1 శాతం నుంచి 0.3 శాతం వరకు పొటాషియం 0.5 శాతం నుండి 2.0 శాతం వరకు ఉంటాయి. వీటితో పాటు సూక్ష్మ పోషకాలు కూడా ఉంటాయి. పంట ఎదుగుదల దిగుబడికి ఈ మూడు పోషకాలు పచ్చిరొట్ట పైర్లలో ఉండడంతో రసాయన ఎరువులు పెద్దగా వేయాల్సిన అవసరం ఉండదు. 30 శాతం వరకూ రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించవచ్చు. ప్రస్తుతం రసాయన ఎరువుల బస్తా ధరలు కూడా బాగా పెరిగాయి. ఈ నేపథ్యంలో పచ్చిరొట్ట ఎరువులు వేయడం ఎంతో మేలని సూచిస్తున్నారు.

నియోజకవర్గంలో 90 వేల ఎకరాల సాగు భూమి

నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో సాగుకు అనుకూలమైన భూమి 90 వేల ఎకరాల సాగు భూమి ఉంది. దీనిలో సుమారు 80వేల ఎకరాల్లో పచ్చిరొట్ట సాగును చేపట్టడం జరుగుతోంది. అంతే కాకుండా మిగిలిన చోట్ల కూరగాయ పంటలు వేస్తున్నారు.



పచ్చిరొట్టగా పిల్లిపెసర సాగు

పచ్చిరొట్ట ఎరువులతో లాభాలు

పచ్చిరొట్ట పైరు సాగుతో అనేకలాభాలు ఉన్నాయి. సేంద్రియ పదార్థాలు పెరిగి, తద్వారా అన్ని రకాల నేలలకు రసాయన, జీవ సంబంధిత లక్షణాలు మెరుగుపడతాయి. నేలలు సంపూర్ణ ఆరోగ్యవంతమైన ఉత్పాదకత పెరుగుతుంది. ఎకరానికి 50 కిలోల వరకు నత్రజని అందుతుంది. భూమి లోపల పొరలలో నిక్షిప్తమైన పోషకాలను వెలికి తెచ్చి లభ్య రూపంలో పంట మొక్కలకు అందిస్తాయి. భాస్వరం, గంధకం వంటి పోషకాల లభ్యత గణనీయంగా పెరుగుతుంది. కలుపు మొక్కలు నాశనమవుతాయి. అందువల్ల రైతులందరూ పచ్చిరొట్ట పైర్లను సాగు చేయడం మంచిదని వ్యవసాయశాఖ అధికారులు సూచిస్తున్నారు.

పచ్చిరొట్ట పంటను నేలలో కలియదున్నాలి



పచ్చిరొట్ట సాగుకు ఇదే అదునైన సమయం. ఖరీఫ్, రబీ సాగుల అనంతరం మళ్లీ పంట సాగు చేసే సమయం వరకు ఉన్న ఖాళీ సమయాల్లో పచ్చిరొట్ట పంటలను వేయాలి. సాగు అదునుకు వచ్చిన సమయంలో పచ్చిరొట్ట పంటను నేలలో కలియదున్నాలి. దీని వలన నేల సారవంతం అవుతుంది. ఖరీఫ్‌లో సాగు చేసే పంటలకు బలం అధికంగా చేకూరి పంట అధిక దిగుబడులు సాధించవచ్చు.

– స్వర్ణలత, ఏడీఏ, పామర్రు

ఉపాధిలో రూ.15.86 కోట్ల విలువైన పనులు

కైకలూరు (కలిదిండి): మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం(ఎంజీఎన్ఆర్ఈజీఎస్) ద్వారా గ్రామాల్లో ప్రజలకు పెద్ద ఎత్తున పనులు కల్పిస్తున్నామని జంగారెడ్డిగూడెం ఏపీడీ కె.ప్రఫుల్లకుమార్ అన్నారు. కలిదిండి స్త్రీ శక్తి భవనం వద్ద 2021–22 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమం శుక్రవారం జరిగింది. పథకం ద్వారా మండలంలో ఇప్పటివరకు జరిగిన పనులపై సమీక్ష చేసి పని రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏపీడీ మాట్లాడుతూ మండలంలో 398 పనులకుగాను ఇప్పటివరకు 2,07,000 పనిదినాలను 5,018 మంది కూలీలకు వేతనాలు, పనులు సామగ్రి నిమిత్తం రూ.15,86,72,000ను ఖర్చు చేశారన్నారు. పంచాయతీరాజ్‌లో 113 వివిధ ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణం నిమిత్తం రూ.5,65,00000, సర్వశిక్షాభియాన్‌లో నిర్మాణాలకు రూ.10,73,000, ఏపీఎస్‌డబ్ల్యూడీసీలో కాంపౌండ్ వాల్స్ నిమిత్తం రూ.8,31000, ఆర్‌డబ్ల్యూఎస్ స్కీమ్‌లో పనుల నిమిత్తం రూ.2,62,000 పనులు చేశారన్నారు. మస్టర్‌లో పేర్లు దిద్దుబాటు, రూ.2,321 నగదు పక్కదారి పట్టడం, రూ.639 నగదు కూలీలకు ఇవ్వకపోవడం తదితర సమస్యలను గుర్తించామన్నారు. అదేవిధంగా మండలంలో సోనారుద్రవరంలో రూ.27,167 నగదు పనులలో వ్యత్యాసం గుర్తించామన్నారు. సర్వశిక్షాభియాన్ పనులు రూ.10,73,000కు రికార్డులు అప్పగించలేదని, దీనిపై ఏఈకి నోటీసు పంపామన్నారు. గ్రామాల్లో ఈ పథకం ద్వారా నాటిన మొక్కలు చనిపోయిన చోట కొత్త మొక్కలు నాటి ఎంపీడీఓతో ధ్రువీకరణపత్రం అందించాలని ఆదేశించామన్నారు. ఎన్ఆర్ఈజీఎస్ విజిలెన్సు అధికారి ఆర్.లోకేష్, ఎంపీడీఓ సీతారాంకుమార్, ఏపీఓ ఆనందకుమారి పాల్గొన్నారు.



సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమంలో అధికారులు

మారిన వాతావరణంతో ఆందోళన

ముదినేపల్లి రూరల్: వాతావరణంలో ఒక్కసారిగా వచ్చిన మార్పులతో మండలంలోని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. మూడు రోజుల పాటు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ చేస్తున్న హెచ్చరికల నేపథ్యంలో వ్యవసాయ పనులు ముమ్మరం చేశారు. మండలంలో 12 వేల ఎకరాలకు పైబడి రెండో పంటగా మినుము సాగు చేశారు. ఈ పైరును ప్రస్తుతం తీతలు తీస్తూ నూర్పిడి చేసే పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఇలాంటి తరుణంలో శుక్రవారం ఉదయం నుంచి మబ్బులు, ఈదురుగాలులతో పాటు అడపాదడపా కురుస్తున్న వర్షం రైతులను ఆందోళనకు గురిచేస్తోంది. మండల వ్యాప్తంగా 50 శాతానికి పైగా మినుము పైరు నూర్పిడి చేసినట్లు వ్యవసాయాధికారి బి.వేణుమాధవ్ తెలిపారు. మిగిలిన పైరును అనేక గ్రామాల్లో ముమ్మరంగా తీతలు తీస్తూ నూర్పిడ్లు చేస్తున్నారు. ప్రస్తుతం మారిన వాతావరణం పైరుకు తీవ్ర నష్టం కల్గించే ప్రమాదముందనే ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అనేక మంది రైతులు పైర్లను తీతలు తీసి పొలాల్లో పనులుగా వేశారు. ఇవి పూర్తిగా ఎండిన తరువాత కుప్పలు వేసి నూర్పిడి చేయవలసి ఉంటుంది. ఇలాంటి పరిస్థితుల్లో మారిన వాతావరణంతో ఏమి చేయాలో పాలుపోని పరిస్థితుల్లో రైతులున్నారు. పనులు పూర్తిగా ఆరకుండానే వర్షానికి దెబ్బతింటాయనే భయంతో యంత్రాలతో ముమ్మరంగా నూర్పిడి చేస్తున్నారు. ఈ విధంగా నూర్పిడి చేసిన మినుమును తరువాత ఆరబెట్టుకోవచ్చనే ఆలోచనతో తేమతో కూడిన పనులనే నూర్పిడి చేస్తున్నారు. మారిన వాతావరణంతో కూలీలకు ఒక్కసారిగా డిమాండ్ పెరిగింది. పైరు తీత తీసినందుకు రోజుకు రూ.500 కూలి చెల్లిస్తున్నారు. అదేవిధంగా తీసిన పైరును కుప్పలుగా వేసి నూర్పిడి చేసేందుకు రూ.700 వరకు కూలి ఇస్తున్నారు. ప్రస్తుత వాతావరణంతో కూలీల కొరత ఎదురుకావడంతో కూలి రేటు అమాంతం పెరిగిపోయింది. మరో రెండు రోజుల పాటు వర్షాలు కురుస్తాయని వార్తలు వస్తున్న నేపథ్యంలో పైరును కాపాడుకునేందుకు రైతులు తంటాలు పడుతున్నారు.



యంత్రంతో మినుము పైరు నూర్పిడి చేస్తున్న రైతులు

నేటి నుంచి మల్లేశ్వరస్వామి కల్యాణోత్సవాలు

మండవల్లి: మండవల్లి మల్లేశ్వరస్వామి ఆలయంలో శనివారం నుంచి 20వ తేదీ వరకు భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి వార్ల 41వ వార్షిక కల్యాణ మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ శింగనపల్లి శ్రీనివాసరావు శుక్రవారం తెలిపారు. వడ్లమన్నాడుకు చెందిన బ్రహ్మశ్రీ గూడూరు వెంకటరామకృష్ణ యాజ్ఞికత్వంలో కల్యాణ మహోత్సవాలు జరుగుతాయని పేర్కొన్నారు. గుడివాడ నాగతిరుమల వెంకట్రామనాయుడు తదితర దంపతులతో కల్యాణ మహోత్సవాలు జరుగుతాయని తెలిపారు. 18న విఘ్నేశ్వర పూజ, ఉదయం 9.30 గంటలకు శ్రీ మల్లేశ్వరస్వామిని పెండ్లికుమారుని చేయుట, భ్రమరాంబ అమ్మవారిని పెండ్లి కుమార్తెను చేస్తారని పేర్కొన్నారు. సాయంత్రం 5.30 గంటలకు విఘ్నేశ్వరపూజ, నవగ్రహపూజ, కలశ స్థాపన, అఖండస్థాపన, ధ్వజారోహణ, బలిహరణ, మంత్రపుష్ప నీరాజనాలు, తీర్థప్రసాద వినియోగం జరుగుతాయని తెలిపారు. 19న ఉదయం 8 గంటలకు బలిహరణ, హోమం, సాయంత్రం ఆరు గంటలకు హోమం నిర్వహిస్తారని పేర్కొన్నారు. రాత్రి ఎనిమిది గంటలకు భ్రమరాంబ మల్లేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం జరుగుతుందని తెలిపారు. 20వ తేదీ సాయంత్రం ఆరు గంటల నుంచి గ్రామస్తుల సహకారంతో అన్నసమారాధన నిర్వహిస్తున్నట్లు ఈఓ పేర్కొన్నారు.

లంకపల్లిలో నేడు విగ్రహ ప్రతిష్ట

పామర్రు(పమిడిముక్కల): లంకపల్లి గ్రామ శివారు అప్పారావు పేటలో ఉన్నటువంటి పురాతన రామాలయానికి మరమ్మతులు చేసి కొత్తగా ఆలయంలో విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం శనివారం ఉదయం చేపట్టనున్నట్లు నిర్వాహకులు శుక్రవారం తెలిపారు. ప్రముఖ వ్యాపార వేత్త ఘంటా శ్రీహర్ష శాంతి దంపతులు (కేఎంవీ ప్రాజెక్టు, హైదరాబాద్) వారిచే ఈ విగ్రహప్రతిష్ట కార్యక్రమం జరుగుతుందని పేర్కొన్నారు. అనంతరం గ్రామస్తుల కోరిక మేరకు రూ.5 లక్షలతో నిర్మించిన బస్ షెల్టర్‌ను ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ రెండు కార్యక్రమాలకు ఘంటా శ్రీహర్ష రూ.10.50 లక్షలను ఖర్చు చేసినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల అనంతరం సుమారు వెయ్యిమందికి అన్నదానం కార్యక్రమం ఉంటుందని తెలిపారు.

నేడు అవగాహన సదస్సు

పామర్రు: మండల పరిషత్ కార్యాలయంలో శనివారం మధ్యాహ్నం మూడు గంటలకు గ్రామ పరిధిలోని ఐదు సచివాలయాలకు చెందిన కన్వీనర్లు, గృహసారథులకు అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు పామర్రు మండల సచివాలయ కన్వీనర్ ముప్పిడి సురేష్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ హాజరవుతాయని పేర్కొన్నారు.

డిగ్రీ కాలేజీ అభివృద్ధికి రూ.8,85,000 విరాళం

కైకలూరు: దీపక్ నెక్స్‌జన్, ఫుడ్స్, ఫీడ్స్ ప్రైవేటు లిమిటెడ్ యాజమాన్యం, డైరెక్టర్లు అడుసుమిల్లి వెంకట సుబ్రహ్మణ్యం, పునుకొల్లు వెంటరమణ, కొండ్రెడ్డి వెంకట సూర్యనారాయణ, సూర్య ప్రభాకర్, కామినేని బాలమురళీకృష్ణ కలిపి కైకలూరు వైఎస్సార్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ అభివృద్ధి నిమిత్తం రూ.8,85,000 చెక్కును శుక్రవారం బొమ్మలూరు ఫ్యాక్టరీలో అందించారు. ప్రిన్సిపాల్ డాక్టరు బి.రఘునాథరెడ్డి దాతలను సత్కరించారు. కాలేజీ అభివృద్ధికి నెక్స్‌జన్ సంస్థ పలుమార్లు ఆర్థికసాయం అందించిందని అభినందించారు. కార్యక్రమంలో కళాశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ గురజాడ ఉదయశంకర్, కాలేజీ పీడీ ఎస్‌డీవీ సత్యనారాయణ హాజరయ్యారు.



ప్రిన్సిపాల్‌కు చెక్కును అందిస్తున్న దీపక్ నెక్స్‌జన్ డైరెక్టర్లు

మొవ్వ కాలేజీలో తనిఖీలు

మొవ్వ: మొవ్వ గ్రామంలోని క్షేత్రయ్య జూనియర్ కళాశాలలో జరిగిన ఇంటర్ మొదటి సంవత్సర పరీక్షను సిట్టింగ్ స్క్వాడ్, ఫ్లయింగ్ స్క్వాడ్ శుక్రవారం తనిఖీలు చేశాయి. ఫ్లయింగ్ స్క్వాడ్‌గా విజయవాడకు చెందిన రెవెన్యూ అధికారులు బృందం తనిఖీలు నిర్వహించగా, సిట్టింగ్ స్క్వాడ్‌గా అవనిగడ్డ జూనియర్ కళాశాల సుబ్బారావు బృందం కాలేజీలో నిఘా వేసి విద్యార్థుల పరీక్షను పరిశీలించారు. ఈ పరీక్షలకు సీఎస్‌గా కే కిరణ్‌కుమార్, డీఓగా ఎల్.హిరణ్మయి వ్యవహరించారు. ఈ పరీక్షలకు 232 మంది హాజరు కావాల్సి ఉండగా ఐదుగురు విద్యార్థులు గైర్హాజరయ్యారు.

జగనన్న కాలనీల్లో మౌలిక వసతులు

ముదినేపల్లి రూరల్: జగనన్న కాలనీల్లో లబ్ధిదారులకు అన్ని రకాల మౌలిక సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ గంటా సంధ్య అన్నారు. మండలంలోని పెదపాలపర్రు జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలను శుక్రవారం పరిశీలించారు. కాలనీలో పైపు లైన్లు, విద్యుత్ లైన్ల ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. వీటిని పరిశీలించిన సంధ్య లబ్ధిదారులతో మాట్లాడారు. ప్రతి పేదవాడి సొంతింటి కల నెరవేర్చాలన్న ముఖ్యమంత్రి జగనన్న ధ్యేయానికి అనుగుణంగా లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలను సత్వరమే పూర్తి చేయాలన్నారు. ఇందుకు బ్యాంకులు సైతం రుణ సౌకర్యం కల్పిస్తున్నట్లు చెప్పారు. కాలనీల్లో తాగునీరు, విద్యుత్, రోడ్లు వంటి మౌలిక సౌకర్యాలను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. గృహనిర్మాణాలకు సంబంధించి మెటీరియల్‌ను సబ్సిడీ ధరలపై అందిస్తున్నామన్నారు. వీటిని సద్వినియోగం చేసుకుని సత్వరమే నిర్మాణాలు పూర్తి చేసి గృహప్రవేశాలు చేయాలని లబ్ధిదారులకు సూచించారు.



పెదపాలపర్రు కాలనీలో విద్యుత్ లైన్ల ఏర్పాటును పరిశీలిస్తున్న హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్

నాణ్యమైన వైద్య సేవలందించాలి

ముదినేపల్లి రూరల్: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వచ్చే వ్యాధిగ్రస్తులకు నాణ్యమైన వైద్య సేవలందించాలని ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ, ఎంపీడీఓ పి.మల్లీశ్వరీ వైద్యాధికారులకు సూచించారు. మండలంలోని ముదినేపల్లి, గురజ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సమావేశాలను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు సిబ్బందితో ఎంపీపీ, ఎంపీడీఓ మాట్లాడారు. ఆరోగ్య కేంద్రాలకు వచ్చే రోగులను సాదరంగా ఆహ్వానిస్తూ ఓర్పుతో వివరాలు అడిగి తెలుసుకుని వైద్య సేవలందించాలన్నారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు తరణి, శాంతిశ్రీలను కేంద్రాల నిర్వహణ గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో గురజ సర్పంచ్ మంచాల సరస్వతి పాల్గొన్నారు.



గురజ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీపీ, ఎంపీడీఓ

పోస్టర్‌కేర్ స్కాలర్‌షిప్‌పై అవగాహన

మండవల్లి: ప్రభుత్వ భరోసా పిల్లల సంరక్షణ పునరావాసానికి పోస్టర్ కేర్ స్కాలర్‌షిప్ పథకంపై స్థానిక సచివాలయంలో అంగన్‌వాడీ టీచర్లకు, ఆశా వర్కర్లకు సర్పంచ్ మెండా ఝాన్సీ అధ్యక్షతన శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ పథకం ద్వారా నెలకు రూ.4 వేల చొప్పున స్కాలర్‌షిప్ వస్తుందని సర్పంచ్ పేర్కొన్నారు. ప్రజలు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ కోరారు. వైఎస్సార్ సీపీ నాయకులు మెండా సురేష్, మహిళా కానిస్టేబుల్ గాయత్రి, ఏఎన్ఎం కనకదుర్గ, అంగన్వాడీ టీచర్లు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

పెద ఎరుకపాడులో శిలువ మార్గ యాత్ర

గుడివాడరూరల్: పెద ఎరుకపాడు ఆర్సీఎం చర్చి ఆధ్వర్యంలో శుక్రవారం క్రీస్తు శిలువ మార్గ యాత్రలు నిర్వహించారు. ఈ సందర్భంగా మౌంట్ కార్మెల్‌మాత దేవాలయం(ఆర్సీఎం) విచారణ గురువు ఫాదర్ గుజ్జుల మైఖేల్, సహాయగురువు ఫాదర్ రవికాంత్ ప్రత్యేక ప్రార్థనలతో యాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏసుప్రభువు ఆనాడు ప్రజల కోసం ఏవిధంగా శిలువను మోసుకుంటూ వెళ్లారు. అదేవిధంగా దీక్ష తీసుకున్న సభ్యులు శిలువ మార్గాలను గుడ్‌ఫ్రైడే వరకు నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో సిస్టర్స్, ఉపదేశకులు సెబాస్టియన్, జి.జయమ్మ, భాస్కర్, ఆంటోని, క్రీస్తురాజు పాల్గొన్నారు.



శిలువమార్గ యాత్ర నిర్వహిస్తున్న క్రైస్తవులు

వైఎస్సార్ ఆసరాను సద్వినియోగం చేసుకోవాలి

పామర్రు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తెలుగు నూతన సంవత్సరాది ఉగాది నాడు విడుదల చేయనున్న వైఎస్సార్ ఆసరా పథకాన్ని అర్హులైన లబ్ధిదారులు సద్వినియోగం చేసుకుని లబ్ధి పొందాలని గుడివాడ క్లస్టర్ ఏరియా కో–ఆర్డినేటర్ సుందరరావు అన్నారు. స్థానిక సచివాలయం 3,5 పరిధిలోని ప్రతి ఇంటికీ వెళ్లి ఆసరా గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడో విడత వైఎస్సార్ ఆసరా లబ్ధిదారులను గుర్తించి, వారి బ్యాంక్ లింకేజీలను పరిశీలించినట్లు తెలిపారు. మండలంలో 1081 గ్రూపు సభ్యులకు రూ.9,53,18,530ను వారి అకౌంట్‌లలో ఉగాది నాడు ప్రభుత్వం జమచేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమలలో బ్యాంక్ లింకేజీ డీపీఎం కె.కనకరావు, పామర్రు ఏపీఎం సీహెచ్ తిరుపతయ్య, సీసీలు పాల్గొన్నారు.



వైఎస్సార్ ఆసరా గురించి మహిళలకు వివరిస్తున్న ఐకేపీ అధికారులు

మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు

కంకిపాడు: మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని ఎస్ఐ కె.సుధాకర్ హెచ్చరించారు. జిల్లా ఎస్పీ ఆదేశాలతో గురువారం అర్ధరాత్రి కంకిపాడు బైపాస్ మార్గంలో స్పెషల్ డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించారు. మద్యం తాగి వాహనాలను నడుపుతున్న ఆరుగురిని గుర్తించి జరిమానాలు విధిస్తూ కేసులు నమోదు చేశారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతున్న వ్యక్తులను గుర్తించి ఆరు కేసులను నమోదు చేశారు. ఎస్ఐ సుధాకర్ మాట్లాడుతూ మద్యం తాగి వాహనాలను నడపటం వల్ల ప్రమాదాలు జరిగి కుటుంబాలు రోడ్డున పడే ప్రమాదం ఉందన్నారు. కుటుంబ శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని మద్యంకు దూరంగా ఉండాలన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. తనిఖీల్లో అదనపు ఎస్ఐ లక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

గడ్డివామి దగ్ధం



తోట్లవల్లూరు: విద్యుత్‌షార్టు సర్క్యూట్ కారణంగా వరిగడ్డి వామి దగ్ధమైన ఘటన తోట్లవల్లూరులో జరిగింది. స్థానిక బంగాళాతోటలో ఈడే శివనాగేశ్వరరావుకి చెందిన వరిగడ్డి వామికి శుక్రవారం వేకువజామున విద్యుత్‌షార్టు సర్క్యూట్ కారణంగా మంటలు అంటుకున్నాయి. ఈ ప్రమాదంలో ఏడున్నర ఎకరాల వరిగడ్డి కాలిబూడిదైంది. ఉయ్యూరు ఫైర్ అధికారి రవితేజ ఆధ్వర్యంలో ఫైర్ సిబ్బంది మంటలను అదుపు చేశారు. ప్రమాదంలో రూ. 75 వేల ఆస్తినష్టం సంభవించినట్లు ఫైర్ సిబ్బంది తెలిపారు.

ముస్లింల అభివృద్ధికి సీఎం జగన్ కృషి

కైకలూరు: ముస్లిం మైనార్టీల కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విశేష కృషి చేస్తున్నారని ఏలూరు జిల్లా వక్ఫ్ బోర్డు డైరెక్టరు షేక్ చాన్ బాషా అన్నారు. ముదినేపల్లి మసీదులో శుక్రవారం జరిగిన ప్రార్థనల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముస్లిం పెద్దలు ముదినేపల్లిలో ఈద్గాకు మట్టితో మెరక పనులు చేయించాలని కోరారు. స్థానిక ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) దృష్టికి తీసుకెళ్లి పనులు చేయిస్తానని చెప్పారు. కార్యక్రమంలో ముస్లిం పెద్దలు మహమ్మద్ జిలానీ, నూరుల్లా, అల్లాభక్షూ, అబ్దుల్ హలీం పాల్గొన్నారు.



ముస్లిం పెద్దలతో జిల్లా వక్ఫ్ బోర్డు డైరెక్టర్ షేక్ చాన్‌బాషా

గ్లోరీ అవార్డు అందుకున్న జాడ జాన్‌రాజు

గుడివాడరూరల్: గుడివాడలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న జానన్న చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ జాడ జాన్‌రాజుకు అంతర్జాతీయ గుర్తింపు పొందిన మనం ఫౌండేషన్ సంస్థ ఇంటర్నేషనల్ చైర్మన్ కె.చక్రవర్తి గ్లోరీ–2023 అవార్డును ఈ నెల 13వ తేదీన అందజేసినట్లు జానన్న ట్రస్ట్ చైర్మన్ జాన్‌రాజు శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా పట్టణంలోని పలువురు మాట్లాడుతూ జాన్‌రాజు చేస్తున్న సేవలకు గుర్తింపుగా గ్లోరీ అవార్డు రావడం అభినందనీయమన్నారు.



గ్లోరీ అవార్డు అందుకున్న జాడ జాన్‌రాజు

విద్యార్థిని అదృశ్యంపై కేసు

పెనమలూరు: విద్యార్థిని అదృశ్యంపై పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. సీఐ గోవిందరాజు తెలిపిన వివరాల ప్రకారం... పెనమలూరు ఆశ్రయం కాలువ కట్టపై డి.కృష్ణవేణి కుటుంబ సభ్యులతో ఉంటుంది. ఆమె కుమార్తె (15) ప్రైవేటు పాఠశాలలో 9వ తరగతి చదువుతుంది. అయితే బుధవారం తన ఫ్రెండ్ ఇంటికి వెళ్లివస్తానని బయటకు వెళ్లింది. ఆమె ఎంతకూ తిరిగి ఇంటికి రాక పోవటంతో విద్యార్థిని తల్లి పలు ప్రాంతాల్లో వెతికింది. ఆచూకీ లభించక పోవటంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది.